క్లుప్తంగా

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నీలం ఐలేష్



స్టేషన్‌ఘన్‌పూర్: ట్రాన్స్‌కో ఘన్‌పూర్ లైన్ ఇన్‌స్పెక్టర్ నీలం ఐలేష్ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. హనుమకొండలోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఐలేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో పాల్గొన్నానని, 1993లో విద్యుత్ శాఖ ఉద్యోగంలో చేరిన పదిరోజుల్లో ఐఎన్‌టీయూసీ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. మొదట జనగామ డివిజన్ అధ్యక్షుడిగా, 1998లో ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, 2022లో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, అనంతరం రాష్ట్ర డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసినట్లు పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ తరఫున కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ మూడుసార్లు జనగామ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అదనపు బాధ్యతలు చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికవడం బాధ్యత మరింతగా పెరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐలేష్‌ను నాయకులు సన్మానించారు. ఎస్.పెద్దిరెడ్డి, ఓ.యాదగిరి, బి.రాజ్‌కుమార్, వాసం శ్రీధర్‌పటేల్, పొన్నం భిక్షపతి, ఆనంద్, గబ్బెట సుధాకర్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

'స్పోకెన్ ఇంగ్లిష్'ను సద్వినియోగం చేసుకోవాలి



పాలకుర్తి టౌన్: స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంటా రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను రవీందర్ పరిశీలించారు.

ఎమ్మెల్సీ 'పల్లా'ను కలిసిన సర్పంచ్

చిల్పూరు: ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని వెంకటాద్రిపేట సర్పంచ్ కందుల రఘుపతి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీని కోరగా రూ.15 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఉప సర్పంచ్ రమేష్‌రెడ్డి, గాదె జయపాల్‌రెడ్డి నోముల సురేష్ పాల్గొన్నారు.

కేసు నమోదు

నర్మెట: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పలువురిపై నర్మెట పోలీసులు కేసులు నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సోమవారం సాయంత్రం పెట్రోలింగ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించగా బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పలువురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై గైకాడి అనిల్ కుమార్ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి



అనిత (ఫైల్)

కొడకండ్ల: మండలంలోని రేగుల గ్రామానికి చెందిన ప్రైకటనోజు అనిత(35) చికిత్స పొందుతూ వరంగల్ ఎంజీఎంలో సోమవారం మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో రెండు రోజుల క్రితం అనిత పురుగుల మందు సేవించగా కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త రాజాచారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సోమవారం మృతదేహానికి పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నారు.

31న 'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయండి

హన్మకొండ చౌరస్తా: ఈనెల 31వ తేదీన హైదరాబాద్‌లో ఆరు ఎకరాల్లో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించిన బ్రాహ్మణ భవన ప్రారంభోత్సవానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బ్రాహ్మణ సేవా సమతి వరంగల్ త్రినగరి అధ్యక్షుడు పెండెం రాఘవరావు విజ్ఞప్తి చేశారు. హనుమకొండలోని బ్రాహ్మణసేవా సమితి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015, జనవరి 9న వరంగల్ బ్రాహ్మణ సంఘాల వేదికలో ఇచ్చిన హామీ మేరకు బ్రాహ్మణుల కోసం భవనం నిర్మించినందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కలను సంరక్షించాలి

బచ్చన్నపేట: గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న వన నర్సరీల్లో మొక్కలను వంద శాతం రక్షించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించి వన నర్సరీలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామస్తులు తమ ఇంటి, నల్లా పన్నులను సకాలంలో చెల్లించాలని, అట్టి డబ్బులను ఎస్‌టీఓలో జమ చేసి గ్రామాభివృద్ధికి వినియోగించడం జరుగుతుందన్నారు. అలాగే జాబ్ కార్డు కలిగిన వారందరూ ఈజీఎస్ పనులకు వెళ్లాలని, పనులు కావాలనుకునే వారు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, జాబ్ కార్డు జిరాక్స్‌లను పంచాయతీ కార్యదర్శికి అందజేయాలన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామస్తులు సహకరిస్తూ భాగస్వాములు కావాలని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్‌లు, జీపీ సిబ్బంది గ్రామస్తులతోపాటు తదితరులు పాల్గొన్నారు.



బచ్చన్నపేట: నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘురామకృష్ణ



రఘునాథపల్లి: నర్సరీలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీఓ వెంకటేశ్వర్లు

మొక్కల పెంపకంపై శ్రద్ధ తీసుకోవాలి

రఘునాథపల్లి: నర్సరీల్లో మొక్కల పెంపకంపై పంచాయతీ, ఈజీఎస్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీఓ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని సోమయ్యకుంట తండా, మాధారం, మంగళిబండతండా, రఘునాథపల్లిలో ఆయన హరితహారం నర్సరీలను సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎంపీఓ మాట్లాడుతూ నర్సరీ నిర్వహణలో లోపాలు ఉండొద్దన్నారు. భావితరాల భవిష్యత్ దృష్ట్యా మొక్కలను పెంచాలన్నారు. దీని ద్వారా ప్రాణ కోటికి జీవనాధారమైన ఆక్సిజన్ లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



స్పోర్ట్స్ దుస్తులు అందుకున్న క్రీడాకారులతో తహసీల్దార్ హరిప్రసాద్, ఎస్సై నరేష్

తరిగొప్పుల: క్రీడల్లో గెలుపోటములు సహజమని, గెలుపే లక్ష్యంగా చివరి వరకు పోరాడాలని తహసీల్దార్ బాశెట్టి హరిప్రసాద్, ఎస్సై దూదిమెట్ల నరేష్ అన్నారు. సీఎం కప్-2023లో భాగంగా మండల స్థాయిలో గెలుపొందిన కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్ జట్టు సభ్యులకు తహసీల్దార్, ఎస్సై, సర్పంచ్ దామెర ప్రభుదాస్ స్వంత నిధులతో సమకూర్చిన స్పోర్ట్స్ దుస్తులను సోమవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. తరిగొప్పుల మండల ఖ్యాతిని రాష్ట్ర స్థాయికి తీసుకువెళ్లాలని క్రీడాకారులకు సూచించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ అంకం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, పీఈటీ మాధవి , పోలీస్ సిబ్బంది విఠల్ రావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ క్యాన్లపై మూతలెక్కడ..?



ఆటోలో మూతల్లేకుండా ఉన్న మినరల్ వాటర్ క్యాన్లు

జనగామ: జనగామ పట్టణంతో పాటు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో మినరల్ వాటర్ పేరిట అమ్మకాల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఆటోల ద్వారా 20 లీటర్ల క్యాన్లను అమ్మకాలు చేసే సమయంలో పలువురు నిర్వాహకులు వాటిపై మూత కూడా బిగించడం లేదు. మూతల్లేకుండా వార్డులు, ప్రధాన రహదారులు తిరుగుతూ దుమ్ము, ధూళి పడుతున్న వాటన్‌ను యథేచ్ఛగా అమ్ముతున్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది.

మంత్రిని కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

కొడకండ్ల: మండలకేంద్రంలోని శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణం అసంపూర్తిగా నిల్చిపోయిందని.. నిధులు మంజూరు చేయాలని సోమవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కలిసి కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి రూ. 5 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. సంఘం నాయకులు జ్ఞానేశ్వరచారి, రామాచారి, ఆగాచారి, ఉపేంద్రాచారి, సోమయ్య, శ్రీనివాస్, కాశీ, సోమయ్య ఉన్నారు.

మంత్రిని కలిసిన ఆలయ చైర్మన్

చిల్పూరు: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు సోమవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి చేసిన అభివృద్ధి పనులను వివరించి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కోటాలో నిధులు మంజూరు చేయాలంటూ కోరారు. దీంతో మంత్రి దయాకర్‌రావు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.



కొడకండ్ల: మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్‌లో చేరిక

దేవరుప్పుల: మండలంలోని రామరాజుపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోవింద్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ మండల సమన్వయకర్త పల్ల సుందర్‌రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్ష,కార్యదర్శులు దయాకర్, రవి, దుర్గారెడ్డి, సర్పంచ్ బండి స్నేహ, నర్సింహులు, ఎంపీటీసీ మేడ కళ్యాణి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

'మిల్లులను సీజ్ చేయండి'



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీఎం బృందం

జఫర్‌గఢ్: తరుగు పేర ధాన్యంలో కోత విధిస్తున్న రైస్ మిల్లులను వెంటనే సీజ్ చేయాలని సీపీఎం మండల నాయకుడు గుండెబోయిన రాజు, రైతు సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని తమ్మడపల్లి (జి)లో సీపీఎం బృందం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లలో రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అకాల వర్షాలు, వడగళ్లతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. చేతికివచ్చిన కొద్దిపాటి పంటను అమ్ముకునేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఎలాంటి కోతలు లేకుండా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని వారు హెచ్చరించారు. నాయకులు వడ్లకొండ సుధాకర్, రాజు, పెద్ద రాములు, యాదగిరి, నక్క ఎల్లయ్య, తేజ, శ్యామ్, వేణు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకుల అరెస్ట్

పాలకుర్తి టౌన్: ఇండ్ల స్థలాల సాధనకై భూపోరాటానికి పిలుపును నిచ్చిన సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా, మండల కార్యదర్శి జీడి సోమయ్యను సోమవారం స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో పాలకుర్తిలో ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకునేందుకు సోమవారం పిలుపు ఇవ్వడంతో ముందస్తుగా వారిని పోలీసులు వారిని అరెస్టు చేశారు.

అక్రమ అరెస్టులను ఖండించండి

నిలువ నీడలేని పేదల కోసం పోరాడుతున్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేరాజా, మండల కార్యదర్శి జీడి సోమయ్యలను అక్రమ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బహుజన కులాల ఐక్యవేదిక వ్యవస్థాపకుడు గుమడి రాజుల సాంబయ్య అన్నారు. సోమవారం అయన మాట్లాడుతూ పోరాటాలను పాలకవర్గాలు సహించడంలేదని, భూకబ్జాదారులకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారిని, ప్రభుత్వ భూముల రక్షణకు పోరాడుతున్న నాయకులను కేసుల పేరుతో వేధిస్తున్నారన్నారు అరెస్టులు, కేసుల ద్వారా పోరాటాలను అణిచివేయలేరని ఆయన అన్నారు.



పోలీసుల అదుపులో ఉన్న లిబరేషన్ నాయకులు

బియ్యం అందజేత

రఘునాథపల్లి: మండలంలోని భాంజీపేటలో కాంగ్రెస్ నాయకుడు ముప్పిడి చిన్న యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాంగ్రెస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.50 కేజీల బియ్యం అందజేశారు. ఎంపీటీసీ సోమనాథ్, కృష్ణ, ఇస్తారి, వెంకన్న, కొండయ్య, విక్రంగౌడ్ పాల్గొన్నారు.



బియ్యం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భుజేందర్‌కు జాతీయ పురస్కారం



పాలకుర్తి టౌన్: బమ్మెర గ్రామానికి చెందిన కవి, కళాకారుడు మాన్యపు భుజేందర్ జాతీయ పురస్కారం అందుకున్నారు. శ్రీశ్రీ అంతర్జాతీయ కళావేదిక ఆధ్వర్యాన కర్నూలు నగరంలో ఆదివారం నిర్వహించిన 119వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో ఆయన కవితా గానం చేశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తికొండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ ఉపాధ్యక్షురాలు కట్ల భాగ్యలక్ష్మి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, జాతీయ సహాయ కార్యదర్శి చెట్టి లలిత, సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా పురస్కారాన్ని అందకున్నారు.

నడకకు దారెక్కడ ?

జనగామ: జనగామ జిల్లా కేంద్రం ఫ్లై ఓవర్ ఫుట్‌పాత్‌పై పురపాలక అధికారులు ఏర్పాటు చేసిన పూలకుండీలు కాలినడక వెళ్లే వారికి ఇబ్బందికరంగా మారింది. బ్రిడ్జి నిర్మాణం చేసే సమయంలో పాదచారుల కోసం ఫుట్‌పాత్ ఏర్పాటు చేస్తారు. కానీ ఇక్కడి అధికారుల అనాలోచిత నిర్ణయంతో కేవలం వాహనాల రాకపోకలకు మాత్రమే అవకాశం ఉండగా పాదచారుల పరిస్థితి ఏంటనే ప్రశ్న పట్టణ వాసులు వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయల ప్రజా ధనాన్ని అవసరం లేని పనులకు ఖర్చు చేస్తున్నారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళ్లే ప్రజల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయింది.



బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళ్తున్న ప్రజలు



బ్రిడ్జి ఫుట్‌పాత్ రెండు వైపులా ఉన్న పూలకుండీలు

పోరాట యోధుడు సత్యనారాయణ

జనగామ రూరల్: తాను జీవించి ఉన్నంతకాలం కార్మికుల హక్కుల కోసం పోరాడిన గొప్ప కార్మికోద్యమ నేత పర్స సత్యనారాయణ అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు కొనియాడారు. సోమవారం జిల్లా కార్యాలయంలో సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరతెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన గొప్ప పోరాట యోధుడని అన్నారు. కార్మికుల సమస్య పరిష్కారానికి విశేషంగా కృషి చేశారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో కార్మికోద్యమాలు నిర్వహించాలన్నారు. నాయకులు తాండ్ర ఆనంధం, కళ్యాణ లింగం, మల్లేష్‌రాజ్, బుచ్చిరెడ్డి, నరసింహులు, కుమార్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పనుల పరిశీలన

బచ్చన్నపేట: ఇంకుడు గుంత ఇంటికి మేలు జరుగుతుందని ఈజీఎస్ ఏపీఓ కృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పలు వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించి పలువురు ఇళ్ల ముందు ఇంకుడు గుంతల నిర్మాణానికి ముగ్గు పోయించారు. అనంతరం మాట్లాడుతూ ఇంట్లో నిత్యావసరాలకు వాడుకున్న వృథా నీరు అంతా ఇంకుడు గుంతలోకి వెళ్లి ఆరు బయట నిల్వకుండా ఉంటుందన్నారు. దీంతో ఈగలు, దోమల బెడద తప్పడంతోపాటు భూగర్భ జలాలు కూడా పెరుగుతాయన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందిస్తుందని తెలిపారు. ఏపీఎం మురహరి, ఈజీ జగదీష్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయితీ కార్యర్శులు అనిల్‌రాజ్, చక్రధర్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.



ఇంకుడు గుంత నిర్మాణానికి ముగ్గు పోయిస్తున్న ఏపీఓ కృష్ణ

అధిష్ఠానం ఆదేశాల మేరకు పనిచేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు పనిచేయాలని, పార్టీ లైన్ దాటకూడదని ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిల్పూరు మండల ముఖ్య కార్యకర్తల సమన్వయ సన్నాహక సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. పార్టీ అంతర్గత విషయాలపై పార్టీకి సంబంధించిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఎవ్వరూ నేరుగా మీడియా వద్దకు వెళ్లొద్దని, ఏమైనా సమస్యలుంటే ఎమ్మెల్యేగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఇటీవల చిల్పూరు మండలంలో జరిగిన పరిణామాలపై మండల నాయకులను ఎమ్మెల్యే సున్నితంగా హెచ్చరించారు. ఈ నెల 26న నిర్వహించనున్న చిల్పూరు మండల క్లస్టర్-2 బీఆర్‌ఎస్ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కంకణబద్ధులై పనిచేయాలన్నారు. మండల ఆత్మీయ సమావేశాలు ముగిశాక జూన్ 5 నుంచి పార్టీ గ్రామాల ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. చిల్పూరు మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

ఘనంగా బీరప్ప కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న పూజారులు, భక్తులు

బచ్చన్నపేట: మండలంలోని నారాయణపురంలో నిర్వహిస్తున్న బీరప్ప పండుగలో భాగంగా సోమవారం ఒగ్గు బీర్ల పూజార్లు బీరప్ప, కామరాతి కళ్యాణాన్ని ఘనంగా జరిపించారు. బీర్ల వారు దేవతల చరిత్రలను ఒగ్గు కథ రూపంలో పలు వేషధారణలో చెప్పగా వందలాది మంది తిలకించారు. కార్యక్రమంలో కుల పెద్దలు వస్పరి నర్సింహులు, పరిదె కొమురయ్య, సత్తయ్య, మల్లయ్య, సిద్దులు, ధర్మేందర్, సాయి మల్లయ్య, బాలయ్య, రాములు, కిష్టయ్య, భీమేష్, బుచ్చి మల్లయ్య, శ్రీనివాస్ ఒగ్గు, బీర్ల పూజారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ

మానవులు తమకు తోచినంత విధంగా పలువురికి సహాయపడుతూ దాన ధర్మాలను చేయాలని నారాయణపురం సర్పంచ్ మాసపేట రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం గ్రామంలో జరుగుతున్న బీరప్ప ఉత్సవాల్లో భాగంగా శ్రీ బీరప్ప దేవాలయం వద్ద గ్రామస్తుడు ధర్మ రాంరెడ్డి, సునీత దంపతులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాత దంపతులను కురుమ సంఘం నాయకులు శాలువా, మెమొంటోతో సత్కరించారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని నిరసన

తరిగొప్పుల: ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని నర్సాపూర్ రైతులు సోమవారం గ్రామంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారని, ఈ ఏడాది ఏర్పాటు చేయకపోవడంతో తాము పండించిన పంటను ఇబ్బందులుపడుతూ అబ్దుల్‌నాగారంలోని కేంద్రానికి తీసుకెళ్లాల్సి వస్తోందని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో శెట్టి సదయ్య, ఇరుమల్ల సమ్మయ్య, తరాల సమ్మయ్య, గొర్రెకంల రాజన్న, మల్లయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నర్సాపూర్ రైతులు

బుడగ జంగాలకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న రాందాస్

బచ్చన్నపేట: రాష్ట్రంలో 10 లక్షల జనాభా గల బేడ బుడిగ జంగాలకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు సిరిపాటి రాందాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బుడిగ జంగాల నాయకులు తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటం నుంచి నేటి వరకు సీఎం కేసీఆర్ వెంటే నడుస్తున్నారని అన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతల యాదగిరికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరారు. అందరం ఏకమై తమ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా అందిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు పర్వతం యాదగిరి, మండల కార్యదర్శి కడకంచి బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల వెంకటయ్య, జిల్లా యూత్ అధ్యక్షుడు చింతల కరుణాకర్, నాయకులు పర్వతం అయిలయ్య, తూర్పాటి యాదగిరి, పత్తి వెంకటయ్య, కడకంచి నర్సయ్య, లక్ష్మినారాయణ, రమేష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: తెలుగుదేశం పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని పార్టీ నియోజకవర్గ నాయకుడు బైరపాక ప్రభాకర్ అన్నారు. డివిజన్ కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ డిజిటల్ సభ్యత్వాల్లో టెక్నికల్ సమస్యలతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పార్టీ గ్రామ కమిటీ నుంచి రాష్ట్ర కమిటీ వరకు అన్ని పదవులను రద్దు చేశారని తెలిపారు. ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ పిలుపుతో సభ్యత్వాలు మ్యాన్యువల్‌గా చేయించిన పుస్తకాలతో సభ్యత్వాలు చేస్తున్నారని, పార్టీ పార్లమెంట్, నియోజకవర్గ ముఖ్య నాయకులకు సదరు సభ్యత్వ పుస్తకాలు ఇచ్చారని, ప్రస్తుతం సభ్యత్వాలు కొనసాగుతున్నాయన్నారు. సభ్యత్వాలు పూర్తయ్యాక పార్టీ గ్రామ, మండల, జిల్లా, పార్లమెంట్, రాష్ట్ర కమిటీలను వేస్తారన్నారు. కొందరు నాయకులు అత్యుత్సాహంతో రద్దయిన కమిటీలు ఉన్న ట్లు చూపిస్తున్నారని, అది ఏమాత్రం సమంజసం కాదన్నారు. అందరూ ఐక్యంగా పనిచేయాలని, పనిచేసిన వారికి గుర్తింపు లభిస్తుందని, నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన కోరారు. చొల్లేటి కృష్టారెడ్డి, మోహన్‌నాయక్, సిద్దిరాములు, మాదిరెడ్డి ధర్మారెడ్డి, కుమారస్వామి, ప్రశాంత్, శ్రీనివాస్, హరీష్ పాల్గొన్నారు.